విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య
www.suryaa.news



ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
24-2-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 174

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఆరోగ్య, బీమా భద్రతా పథకాలు

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య భద్రత.. ప్రమాద బీమాతో కుటుంబాలకు ఆర్థిక రక్షణ

- ప్రీమియం లేకుండానే బీమా అందించే ప్రత్యేక విధానం
- నగదు రహిత వైద్య సేవలకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్ అమలు
- 17 లక్షల మందికి పైగా లబ్ధిదారులను లక్ష్యంగా పథకం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విస్తృత చికిత్సా సదుపాయాలు
- వైద్య శాఖలో సంస్కరణలకు కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఉద్యోగ సంఘాల దీర్ఘకాల డిమాండ్‌కు పరిష్కారం
- డిజిటల్ హెల్త్ కార్డులతో పారదర్శక వైద్య సేవలు
- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆరోగ్య భద్రతతో పాటు జీవిత బీమా సదుపాయాన్ని కల్పించే రెండు కొత్త పథకాలను ప్రకటించడం ద్వారా ఉద్యోగుల భవిష్యత్తుకు ఆర్థిక, వైద్య పరమైన రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. దేశంలో అరుదుగా కనిపించే విధంగా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ పథకం కింద లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే బీమా ప్రయోజనాలను పొందే విధంగా రూపకల్పన చేయడం విశేషం.**

హైదరాబాద్: ప్రమాద బీమా పథకం కింద ఉద్యోగి ప్రమాదంలో మరణించిన సందర్భంలో కుటుంబానికి భారీ పరిహారం అందేలా వ్యవస్థను రూపొందించారు. అదే సమయంలో సహజ మరణం సంభవించినా ఆర్థిక సహాయం అందేలా నిబంధనలు చేర్చడం ద్వారా కుటుంబాల భద్రతను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. సాధారణంగా బీమా పథకాల్లో ప్రీమియం భారంగా ఉండే పరిస్థితి ఉంటుంది. అయితే ఈ పథకంలో ఉద్యోగులు, పెన్షనర్లు నేరుగా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ముందుకొచ్చింది. దీని వల్ల తక్కువ వేతనాలు పొందే ఉద్యోగులు కూడా సమానంగా ప్రయోజనం పొందే అవకాశం కలుగుతుంది. ఇదే సమయంలో నగదు రహిత వైద్య సేవలను అందించే క్యాష్‌లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ అమలు నిర్ణయం ఉద్యోగ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. అనారోగ్య సమయంలో ఆస్పత్రుల్లో భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి అనేక కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఎంప్యానెల్ చేసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా నగదు చెల్లించకుండా చికిత్స పొందే సౌకర్యం కల్పించడం సమగ్ర సంక్షేమ చర్యగా భావించవచ్చు. వేల సంఖ్యలో వైద్య సేవలను పథకం పరిధిలోకి తీసుకురావడం ద్వారా సాధారణ రోగాల నుంచి క్లిష్టమైన చికిత్సల వరకు విస్తృత సేవలు అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా లబ్ధి పొందడం మరింత ప్రాముఖ్యత కలిగిన అంశం. కుటుంబ ఆరోగ్య భద్రతను సమగ్రంగా కవర్ చేయడం వల్ల ఉద్యోగులపై ఉండే వైద్య ఆందోళనలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఉద్యోగులు తమ మూల వేతనంలో చిన్న శాతం వాటాను చెల్లించగా, ప్రభుత్వం సమాన భాగస్వామ్యంతో ట్రస్ట్‌కు నిధులు సమకూర్చే విధానం దీర్ఘకాలిక స్థిరత్వాన్ని సూచిస్తుంది.

ఇటీవలి కాలంలో వైద్య ఖర్చుల భారం పెరుగుతున్న నేపథ్యంలో ఈ తరహా క్యాష్‌లెస్ వ్యవస్థ అవసరం మరింత స్పష్టమైంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో లెటర్ ఆఫ్ క్రెడిట్ ఆలస్యాలు, చెల్లింపుల సమస్యల వల్ల ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులు

(మిగతా 2వ పేజీలో)



## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రథమ సంవత్సరం బుధవారం, ద్వితీయ సంవత్సరం గురువారం నుంచి పరీక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- మొత్తం 9.97 లక్షల మంది హాజరు కానున్న వార్షిక పరీక్షలు
- ఐదు నిమిషాల ఆలస్యానికి కూడా పరీక్ష రాసేందుకు అనుమతి
- విద్యార్థుల రవాణా కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సదుపాయం
- ఒత్తిడి నివారణకు హెల్ప్‌లైన్, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో

హైదరాబాద్: ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ పలు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మొత్తం 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఫస్ట్ ఇయర్‌కు 4,89,126 మంది, సెకండ్ ఇయర్‌కు 5,07,949 మంది కలిపి మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయనున్న నేపథ్యంలో కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

## ర్యాపిడో ప్రయాణం ప్రాణాలను బలిగొన్న ప్రమాదం

- దుబాయ్ వీసా ప్రక్రియ కోసం నగరానికి వచ్చిన యువతి దుర్మరణం
- పార్ట్‌టైమ్ ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేసిన హోంగార్డు కూడా మృతి
- బంజారాహిల్స్‌లో అతివేగంతో వచ్చిన ట్యాంకర్ ఢీకొన్న ఘటన
- బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే కిందపడ్డారు
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించినా హోంగార్డు ప్రాణాలు నిలువలేదు
- డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసిన పోలీసులు




హైదరాబాద్ : హైదరాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లే ఆశలతో నగరానికి వచ్చిన యువతి, అదనపు సంపాదన కోసం పార్ట్‌టైమ్‌గా ర్యాపిడో నడుపుతున్న హోంగార్డు ఒకే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం, ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన కొల్లూరు అక్షిత (20) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి దుబాయ్ వెళ్లేందుకు వీసా ప్రక్రియ కోసం ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. చింతల్‌లోని స్నేహితురాలి ఇంట్లో ఉన్న ఆమె సోమవారం ఉదయం మెహిదీపట్నంలో ఇంటర్వ్యూకు

(మిగతా 2వ పేజీలో)



## ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్ విధిస్తాం: ట్రంప్

- సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిక
- సుప్రీంకోర్టు తనకు తెలియకుండానే మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్య
- దశాబ్దాలుగా కొన్ని దేశాలు అమెరికాను కొల్లగొట్టాయని ఆరోపణ

## హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

- హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం
- ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం
- రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం



# జనగణన 2027కు 33 ప్రశ్నల ప్రశ్నావళి ఆమోదం

- రాష్ట్ర మంత్రివర్గం తొలి విడత హౌస్ లిస్టింగ్‌కు గ్రీన్‌సిగ్నల్
- ప్రతి ఇంటిని సందర్శించి యజమాని, గృహ వివరాల సేకరణ
- ఇంటి నిర్మాణం, గదుల సంఖ్య, వసతులపై వివరాలు నమోదు
- వాహనాల వంటి ఆస్తి సమాచారం కూడా నమోదు చేయాల్సిందే
- మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ డేటా సేకరణకు ఏర్పాట్లు
- అభివృద్ధి, సంక్షేమ, రిజర్వేషన్ల విధానాలకు కీలక గణాంకాలు



హైదరాబాద్: ంజనగణన2027 తొలి విడతకు సంబంధించిన 33 ప్రశ్నల ప్రశ్నావళికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సెస్ నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సాధారణంగా వేసవి సెలవుల సమయంలో ఈ ప్రక్రియ చేపడతారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనగణన నిర్వహిం చబడు తుండగా, రాష్ట్రాల వారీగా జనగణన విభాగం సంచాలకులు పర్యవేక్షణ చేపడతారు. తొలి విడతలో జనగణన సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి నిర్దేశిత ఫార్మాట్ ప్రకారం వివరాలను సేకరిస్తారు. ప్రతి ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు, గృహ స్థితి, వసతులు, జీవన పరిస్థితులకు సంబంధించిన మొత్తం 33 రకాల ప్రశ్నలు అడిగి సమాచారం నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. పౌరులు కోరిన వివరాలను తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణ విధానం, గదుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వినియోగం, పారిశుధ్య వసతులు వంటి గృహ సంబంధిత అంశాలతో పాటు కార్లు, మోటార్ సైకిళ్లు వంటి ఆస్తి వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ సమాచారంతో ప్రజల జీవన స్థితిగతులపై సమగ్ర

(మిగతా 2వ పేజీలో)



## హౌసింగ్ బోర్డు భూములకు భారీ ధరలు

- గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలకు రికార్డు
- కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో రూ.1.64 లక్షలకు విక్రయం
- వేలంలో ప్లాట్లకు తీవ్ర పోటీ, 50 మంది బిడ్డర్ల పాల్గొనడం
- ఎంఐజీ, హెచ్ఐజీ ప్లాట్లపై అధిక డిమాండ్ నమోదు
- మొత్తం విక్రయాల ద్వారా రూ.34.27 కోట్ల ఆదాయం

# సర్కారు ఉద్యోగులకు ఆరోగ్య, బీమా భద్రతా పథకాలు

పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ కొత్త విధానం ఉపయుక్తమవుతుంది. డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలను అందించడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు సేవల వినియోగం సులభతరం అవుతుంది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాల్లో వైద్య శాఖలో సంస్కరణలు కూడా కీలకంగా నిలిచాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవల నాణ్యతను మెరుగుపరచడం, నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా చేయడం, ఔషధాలు, శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను వేగవంతం చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టడం ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుంది. స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలను ప్రభుత్వ విభాగ హోదాకు తీసుకురావడం ద్వారా పరిపాలనా సమర్థత పెరుగుతుందని భావిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని కూడా ప్రభుత్వం గుర్తించినట్లు నిర్ణయాలు సూచిస్తున్నాయి. వైద్య సిబ్బందికి సకాలంలో వేతనాలు, అవసరమైన మౌలిక వసతులు, పరిపాలనా పునర్వ్యవస్థీకరణ వంటి చర్యలు అమలైతే ప్రజలకు అందే సేవలు మరింత మెరుగుపడతాయి. ఇది పరోక్షంగా ఉద్యోగులు, వారి కుటుంబాలకు కూడా నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో సహాయపడుతుంది. ఇక మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా ఆధునీకరణ, మెట్రో స్వాధీనం వంటి ఇతర నిర్ణయాలు కూడా సమగ్ర పరిపాలనా దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. నగరాభివృద్ధి, రవాణా, నీటి సరఫరా వంటి రంగాల్లో తీసుకున్న నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రణాళికను సూచిస్తున్నాయి. అలాగే బడ్జెట్ సమావేశాలు, జనగణన ఏర్పాట్లు వంటి పరిపాలనా అంశాలపై ముందస్తు ప్రణాళిక చేయడం ప్రభుత్వ వ్యవస్థలో క్రమబద్ధతను చూపిస్తుంది. మొత్తంగా చూసినప్పుడు ఉద్యోగుల సంక్షేమాన్ని




కేంద్రీకరించి రూపొందించిన ఆరోగ్య, బీమా పథకాలు పరిపాలనా బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయి. ఉద్యోగులు భద్రంగా ఉంటే పరిపాలనా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుందనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఆర్థిక భద్రత, వైద్య భరోసా, కుటుంబ రక్షణ అనే మూడు ప్రధాన అంశాలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ పథకాలు సక్రమంగా అమలైతే ఉద్యోగ వర్గాల్లో విశ్వాసం పెరగడమే కాకుండా సంక్షేమ పరిపాలనకు ఒక నమూనాగా నిలిచే అవకాశముంది.

# ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్ విధిస్తాం: ట్రంప్

**సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరిక**

**సుప్రీంకోర్టు తనకు తెలియకుండానే మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్య**

**దశాబ్దాలుగా కొన్ని దేశాలు అమెరికాను కొల్లగొట్టాయని ఆరోపణ**

వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాలు అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని, ఇష్టానుసారం వ్యవహరించాలని చూస్తే ఇటీవల అంగీకరించిన సుంకాల కంటే భారీగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టంను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ తన మాట వినని వివిధ దేశాలపై అధిక పన్ను విధించారు. ట్రంప్ అధిక సుంకాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు. టారిఫ్ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లగా, ట్రంప్ తీరును తప్పుబట్టింది. ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది.



# హౌసింగ్ బోర్డు భూములకు భారీ ధరలు

**గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలకు రికార్డు**

**కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో రూ.1.64 లక్షలకు విక్రయం**

**వేలంలో ప్లాట్లకు తీవ్ర పోటీ, 50 మంది బిడ్డర్ల పాల్గొనడం**

**ఎంఐజీ, హెచ్ఐజీ ప్లాట్లపై అధిక డిమాండ్ నమోదు**

**మొత్తం విక్రయాల ద్వారా రూ.34.27 కోట్ల ఆదాయం**

హైదరాబాద్: నగరంలోని హౌసింగ్ బోర్డు భూములకు మరోసారి భారీ ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలో చదరపు గజం రూ.1.76 లక్షల వరకు ధర నమోదవగా, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలకు ప్లాట్ విక్రయమైంది. నగరంలోని గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని భూములను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు హౌసింగ్ బోర్డు ఈ నెల 9న నోటిఫికేషన్ జారీ చేసింది. కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన వేలం పాటలో సుమారు 50 మంది బిడ్డర్లు పాల్గొని ప్లాట్లను దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీ పడ్డారు. విక్రయించిన వాటిలో బౌరంపేట భూమితో పాటు బాచుపల్లిలోని ఒక ఫ్లాట్‌ను మినహాయించి మిగిలినవి ఎంఐజీ, హెచ్ఐజీ కేటగిరీలకు చెందిన ప్లాట్లు కావడంతో కొనుగోలుదారుల ఆసక్తి ఎక్కువగా కనిపించింది. గచ్చిబౌలిలో 263 చదరపు గజాల విస్తీర్ణం ఉన్న ప్లాట్‌కు కనీస ధరను చదరపు గజానికి రూ.50 వేలుగా నిర్ణయించి వేలం నిర్వహించగా, పోటీ కారణంగా చివరకు అది చదరపు గజానికి రూ.1.76 లక్షలకు అమ్ముడైంది. అదేవిధంగా కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో 266 చదరపు గజాల ప్లాట్ చదరపు గజం రూ.1.64 లక్షలకు కొనుగోలు



చేయబడింది. చింతల్ ప్రాంతంలోని ఓపెన్ ప్లాట్లు కూడా మంచి డిమాండ్‌తో చదరపు గజం రూ.84 వేలు, రూ.74 వేల ధరలతో అమ్ముడయ్యాయి. నిజాంపేటలోని సిద్ధి ప్లాట్‌కు కనీస ధర రూ.15 లక్షలుగా నిర్ణయించగా, వేలంలో అది రూ.17.70 లక్షలకు విక్రయమైంది. గచ్చిబౌలిలోని మరో ప్లాట్ చదరపు గజం లక్ష రూపాయలు పలికింది. అలాగే బౌరంపేటలో 2,600 చదరపు గజాల విస్తీర్ణం గల భూమి చదరపు గజం రూ.61 వేల ధరకు అమ్ముడైంది. మొత్తంగా సోమవారం నిర్వహించిన భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలో కీలక ప్రాంతాల్లో భూములపై పెరుగుతున్న డిమాండ్‌కు ఈ వేలం ఫలితాలు స్పష్టమైన సంకేతంగా నిలిచాయి.

# ప్రేమ పెళ్లికి పేరెంట్స్ గ్రీన్ సిగ్నల్ తప్పనిసరి!..

## గుజరాత్ సర్కార్ సంచలన ప్రతిపాదన

**గుజరాత్‌లో ప్రేమ వివాహాలకు కొత్త నిబంధన**

**ఇకపై రిజిస్టర్ మ్యారేజ్‌కు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి**

**మోసపూరిత పెళ్లిళ్లను అడ్డుకోవడమే లక్ష్యమన్న ప్రభుత్వం**

**సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటున్న న్యాయ నిపుణులు**

**ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉన్న కొత్త వివాహ చట్టం**

గుజరాత్‌లో ప్రేమ వివాహం చేసుకోవాలనుకునే జంటలకు రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలంటే ఇకపై తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి ఉండాలనే నిబంధనను తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మేరకు 'వివాహ రిజిస్ట్రేషన్ చట్టం'లో మార్పులు చేయనుంది. ఇది అమల్లోకి వస్తే, తల్లిదండ్రులకు తెలియకుండా పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదు. ప్రతిపాదిత సవరణల ప్రకారం పెళ్లి చేసుకునే జంట తమ తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పారో, లేదో దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలి. దరఖాస్తు అందిన 10 రోజుల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వయంగా వధూవరుల తల్లిదండ్రులకు నోటీసులు పంపుతారు. దరఖాస్తుతో పాటు తల్లిదండ్రుల ఆధార్ వివరాలు కూడా జతచేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన 30 రోజుల తర్వాతే వివాహ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. ఈ నిబంధనల వెనుక ఉన్న ఉద్దేశాన్ని రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘ్వీ అసెంబ్లీలో వివరించారు. "ప్రేమ పేరుతో జరిగే మోసాలను అరికట్టడం, అమాయక యువతులు 'లవ్ జిహాద్' బారిన పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం. మోసపూరిత వివాహాలు సామాజిక వ్యవస్థను చెదపురుగుల్లా నాశనం చేస్తున్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమని, న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో 'హాదియా కేసు'లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వారు గుర్తుచేస్తున్నారు. నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం అనేది ప్రాథమిక హక్కు అని, ఇందులో తల్లిదండ్రులు గానీ, ప్రభుత్వం గానీ జోక్యం చేసుకోరాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కొత్త రూల్స్ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తాయని సోషల్ మీడియాలోనూ విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ నిబంధనలు కేవలం ప్రతిపాదన దశలోనే ఉన్నాయి.

# హైదరాబాద్‌లో 'హెల్మెట్ బ్యాంక్'.. పోలీసుల వినూత్న కార్యక్రమం

**హెల్మెట్ లేని వాహనదారుల కోసం 'హెల్మెట్ బ్యాంక్'**

**జరిమానాకు బదులుగా అక్కడికక్కడే హెల్మెట్ అందిస్తున్న పోలీసులు**

**24 గంటల్లో కొత్తది కొని, తీసుకున్న హెల్మెట్‌ను తిరిగివ్వాలి**

**మల్కాజిగిరిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ పోలీసులు**

**పోలీసుల చొరవపై సోషల్ మీడియాలో ప్రశంసలు**

హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తుంటే జరిమానా విధించడం సాధారణం. కానీ, హైదరాబాద్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోలీసులు దీనికి భిన్నంగా ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాహనదారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా 'హెల్మెట్ బ్యాంక్' పేరుతో వినూత్న చొరవ తీసుకున్నారు. దీని కింద హెల్మెట్ లేని వారికి జరిమానా వేయకుండా అక్కడికక్కడే ఒక హెల్మెట్‌ను అందిస్తున్నారు. సోమవారం సంగీత్ చౌరస్తాలో మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ రాహుల్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి, వారి పేరు, ఫోన్ నంబర్, వాహనం వివరాలు నమోదు చేసుకుంటారు. అనంతరం వారికి 'హెల్మెట్ బ్యాంక్' నుంచి ఒక హెల్మెట్ అందించి పంపిస్తారు. అయితే, 24 గంటల్లోగా వారు సొంతంగా కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి, పోలీసుల వద్ద తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా డీసీపీ రాహుల్ రెడ్డి మాట్లాడుతూ "హెల్మెట్ ధరించడం బరువు కాదు, అదొక బాధ్యత. చిన్న పొరపాటు వల్ల ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. అందుకే జరిమానాల కన్నా, వాహనదారుల్లో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం" అని తెలిపారు. మల్కాజిగిరి జోన్‌లోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ హెల్మెట్ బ్యాంకులు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు. పోలీసుల ఈ కొత్త ప్రయత్నంపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.






# తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు

**మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్న సమావేశాలు**

**మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం**

**మార్చి 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో నిర్ణయం**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

సమావేశాల తొలిరోజైన మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుపుతారు. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.

# హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం**

**ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**

**రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**

హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

# రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేశారు. నకిలీ చర్యలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన వంటి సమస్యలను తగ్గించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు 14416, 80693 91416 అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అవసరమైతే విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని సూచించారు. ఇక రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గురుకులాల మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ఒక్కో విద్యాసంస్థకు సుమారు రూ.50 కోట్ల వరకు కేటాయించే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే లక్ష్యంగా పరిపాలనాపరమైన మార్పులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# జనగణన 2027కు 33 ప్రశ్నల ప్రశ్నావళి ఆమోదం

అంచనాలు వేయడం సాధ్యమవుతుంది. జనగణన గణాంకాలు ప్రభుత్వ విధానాల రూపకల్పనలో అత్యంత ప్రామాణికంగా ఉపయోగపడతాయి. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలు, డీలిమిటేషన్ వంటి కీలక నిర్ణయాలన్నీ ఈ గణాంకాల ఆధారంగానే రూపొందుతాయి. అందువల్ల జనగణన ప్రక్రియను ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యంతో చేపడుతోంది. దేశంలో చివరిసారిగా 2011లో జనగణన నిర్వహించబడింది. 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్19 ప్రభావంతో వాయిదా పడింది. తాజాగా ప్రారంభమైన సెన్సెస్2027లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తూ ఎన్యూమరేటర్లు తమ మొబైల్ ఫోన్ల ద్వారా వివరాలను సేకరించనున్నారు. ప్రత్యేక యాప్ లేదా పోర్టల్ ద్వారా ప్రశ్నలకు సమాధానాలను నమోదు చేసి డిజిటల్ డేటా సేకరణ చేపడతారు. దీంతో ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు గణాంకాల ఖచ్చితత్వం కూడా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ర్యాపిడో ప్రయాణం ప్రాణాలను బలిగొన్న ప్రమాదం

హాజరై అక్కడి నుంచి పంజాగుట్ట వైపు వెళ్లేందుకు ర్యాపిడో బుక్ చేసుకుంది. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సయ్యద్ హుస్సేన్ (40) ఉదయం విధులు ముగించుకున్న అనంతరం అదనపు ఆదాయం కోసం ర్యాపిడో విధుల్లోకి చేరాడు. మెహిదీపట్నంలో అక్షితను బైక్‌పై ఎక్కించుకుని పంజాగుట్ట వైపు ప్రయాణం ప్రారంభించాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్1లోని వెంగళరావు పార్క్ టర్నింగ్ వద్దకు చేరుకున్న సమయంలో మితిమీరిన వేగంతో వెనుక నుంచి దూసుకొచ్చిన వాటర్ ట్యాంకర్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన దెబ్బకు ఇద్దరూ రోడ్డుపై కిందపడగా, ట్యాంకర్ వెనుక చక్రాలు వారిపై నుంచి వెళ్లడంతో అక్షిత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలతో ఉన్న హుస్సేన్‌ను వెంటనే నిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన కూడా కన్నుమూశాడు. తెల్లారితే దుబాయ్ వెళ్లే ఆనందంలో ఉన్న యువతి కలలు క్షణాల్లో చెదిరిపోగా, విధులు ముగించుకుని ఇంటికి వెళ్లాల్సిన హుస్సేన్ చివరి ప్రయాణం ఇదే కావడం కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచింది. ప్రమాదానికి కారణమైన బంజారాహిల్స్ ఇబ్రహీంనగర్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్ ఖాజాపాషా (30)ను పోలీసులు అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. సంఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన నగరంలో అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో మరోసారి స్పష్టంచేసింది.

# కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

ఏడవ వార్డును ఆదర్శవార్డుగా తీర్చిదిద్దుతా...

7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి.



**చౌటుప్పల్.ఫిబ్రవరి 23. ప్రభాత సూర్య :** మున్సిపాలిటీలోని ఏడవ వార్డు అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానని కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం 7వ వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ గా బాధ్యతలు చేపట్టిన కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డిని గజమాలతో, శాలువాలతో ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో పార్టీలకు అతీతంగా 7వ వార్డు అభివృద్ధికి నిత్యం ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఏడో వార్డును అభివృద్ధి చెందిన ఆదర్శవార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రతి సమస్యను తీర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. 7వ వార్డులో తనను రెండుసార్లు గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. తనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన నాయకులకు, కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





## మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన చేసిన: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి23:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో మహిళా సంఘం భవనానికి సోమవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు గాను ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తుందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్తానిక సర్పంచి నల్లోల్ల ఎల్లయ్య,మాజీ ఎంపీ పి వావిలాల నర్సింలు,వైస్ ఎంపీ పి పండుగ రవి కుమార్, బి ఆర్ ఎస్ నాయకులు శివ శంకర్ రావు,ఉప సర్పంచి చెక్క మానస రవీందర్ గౌడ్,మాజీ ఉప సర్పంచి మెరాజ్,మాజీ పి ఏ సి ఎస్ డైరెక్టర్,గుండా రాములు,మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి,నిరుడు యాదగిరి,మహంకాళి,ఖాజా,శేఖర్ వల్లి గారి దుర్గేశ్వర, మన్నే యాదగిరి, ఆకుల మల్లేష్,ఆకుల ప్రభు,కృష్ణ,బాలు,తదితరులు పాల్గొన్నారు.



## రుద్రారం GPR వెంచర్‌లో భూ మోసం ఆరోపణలు ప్లాట్ ఓనర్ల ఆందోళన

**పటాన్చెరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** సంగారెడ్డి జిల్లా రుద్రారం పరిధిలోని GPR వెంచర్‌లో భూ మోసం ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అక్రమ పట్టేదార్ పాస్‌బుక్‌లు, డబుల్ రిజిస్ట్రేషన్లపై ప్లాట్ ఓనర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసిన బాధితులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్ ఓనర్లు కీలక సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ లక్ష్మి నరసింహారెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో బాధితులు తమ ఆవేదనను వెల్లడించారు. ప్లాట్ చేసిన భూమికి అక్రమంగా పట్టేదార్ పాస్‌బుక్‌లు జారీ చేయడం, అదే భూమిని మళ్లీ విక్రయించడం వంటి మోసపూరిత లావాదేవీలు జరిగాయని వారు ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, =ఖూ సంగారెడ్డి, పటాన్‌చెరు వీ=ాలకు ఇప్పటికే ప్రాతినిధ్యాలు సమర్పించినట్లు ప్లాట్ ఓనర్లు తెలిపారు. జిల్లా కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డుల్లో బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్లాట్ ఓనర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి..

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి.**




**ప్రభాత సూర్య నర్సాపూర్ ఫిబ్రవరి23:** నర్సాపూర్ మున్సిపాలిటీని సమగ్రాభివృద్ధి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ లో నూతన పాలకర్గం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నర్సాపూర్ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. మొదట మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. త్రాగు నీరు,డ్రైనేజ్, స్ట్రీట్ లైట్ లు, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపాలిటీ చైర్మెన్ లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు .ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా నన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మెన్ లక్ష్మీ రాజు యాదవ్ ను,వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వభారతి లా కాలేజీలో స్నాతకోత్సవం వేడుకలు. న్యాయశాస్త్ర పట్టా అందుకున్న వెన్నెల




**పటాన్చెరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య : సంగారెడ్డి జిల్లా :** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని విశ్వభారతి కాలేజ్ ఆఫ్ లా ప్రాంగణంలో గ్రాడ్యుయేషన్ సెరిమనీ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నైతిక విలువలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు వివరించారు. సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ వేడుకలో వెన్నెలకు న్యాయశాస్త్ర పట్టాను ప్రొఫెసర్ విజయ లక్ష్మీ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భవాని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో చిన్నారి మృతి పై న్యాయం చేయలేని ప్రభుత్వం. ఎందుకు???

మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్.




**మర్రిగూడ ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య:** మర్రిగూడ. రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనం వల్లనే కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో పసికందు బలైందని మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకట యాదవ్ మాట్లాడుతూ రక్తానికి లేని రంగు కన్నీటి లేని కులం కేవలం మనిషికే ఎందుకు అంటుకున్నాయి, దేవునికే కులం లేదని చెప్పినోళ్లు పసిప్రాణానికి మాత్రం కులం చూపిస్తే అది భక్తి కాదు దురహంకారం వల్లే నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో చోటు చేసుకున్న రెండు నెలల చిన్నారి మృతి చెందడం అత్యంత దారుణమని బాధ్యులైన వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని దోమల ఆరోపించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న సాంబయ్య కి కనకమామిడి నరేందర్ గౌడ్ ఆర్థిక సాయం..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్ పేట్ డివిజన్ అంబేద్కర్ నగర్ కు చెందిన సాంబయ్య ఆరోగ్యం బాగా లేక కూకట్ పల్లి రామ్ దేవ్ రావు హాస్పిటల్ లో ఉన్నాడని తెలుసుకొని కనక మామిడి నరేందర్ పరామర్శించారు అనంతరం డాక్టర్ తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సుహృత్ ట్రస్ట్ ద్వారా ఈరవై వెయ్యి రూపాయలు. 20,000/- రూపాయల చెక్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా కనకమామిడి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ సాంబయ్య కుటుంబానికి ఇంకా ఏమైనా అవసరం ఉన్న ఆదుకుంటామని, నేనున్నానని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సాంబయ్య కుటుంబ సభ్యులు నరేందర్ గౌడ్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



## పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుపుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ వీరారెడ్డిపల్లి విద్యార్థులు

**తుర్కపల్లి ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య:** తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో 2005-06 సంవత్సరంలలో చదివిన వీరారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు చాలా రోజులకి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అందరు విద్యార్థులు హాజరు కావడం విశేషం,చాలా సంతోషం వక్యం చేశారు వాళ్ల చిననాటి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు,ఎల్లపుడు చెరగని మరువని జ్ఞాపకాలు స్నేహితులని గుర్తు చేసుకున్నారు





## గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా,కోనాపూర్ సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి

**తుర్కపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతసూర్య:** కోనాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని గ్రామ సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో డిఎంఎస్ నిధులనుండి ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే కోనాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామాన్ని తీర్చి దిద్దుతానని ,ప్రత్యేక నిధులతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికుమార్ ,ఉపసర్పంచ్ నీళ్ల కరుణాకర్, గ్రామపంచాయతీ సెక్రటరీ సందీప్ రెడ్డి వార్డు సభ్యులు పసుపుల కనకయ్య అక్కెనపల్లి శ్రీలత బంగారు రెడ్డి, నీల మమత, దుర్గయ్య, పసుల కనకయ్య, మాజీ సర్పంచ్ చాడ గోపాల్ రెడ్డి, పాల సొసైటీ చైర్మన్ పసుపుల కనకయ్య, గువ్వ నర్సింలు నీల చంద్రయ్య, నీల వెంకటేష్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఇంటర్ హాల్ టికెట్లు ఇవ్వకుంటే ఆందోళన తప్పదు

**బిఆర్ఎస్వి నేత అశ్వంత్ కుమార్ హెచ్చరిక**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాత సూర్య) :** ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాయకుండా హాల్ టికెట్ ఇవ్వట్లేదు అనే సమాచారం మేరకు సోమవారం బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు అశ్వంత్ కుమార్ స్థానిక బి ఆర్ ఎస్ వి నాయకులు తో కలిసి వివిధ కార్పొరేట్, ప్రవేట్ కళాశాలల యజమాన్యాలను కలిసారు. హాల్ టికెట్స్ ఇవ్వని పలు విద్యా ర్థులకు దగ్గరుండి హాల్ టికెట్లు ఇవ్వాలని సంస్థ యాజమాన్యాన్ని విజ్ఞప్తి మేరకు ఇప్పిం చారు. ఈ సందర్భంగా అశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థికి హాల్ టికెట్ ఆపకుండా ప్రతి ఒక్కరికి ఇవ్వాలని యజమాన్యాలకు డిమాండ్ చేశారు. ఫీజుల కోసం హాల్ టికెట్లు ఆపకుండా విద్యార్థులకు సహకరించాలని, లేని పక్షంలో కళాశాలల ముందు ఆందోళన కార్యక్రమాలు తప్పవని ప్రవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాల యజమాన్యాలకు హెచ్చరించారు.



## పాటి మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** మండలం లోని ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాల్లో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటె సుమలత, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కలెక్టర్ కు వినతి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నల్గొండ



**నల్గొండ ప్రభాత సూర్య:** రైతులకు వెంటనే రైతు భరోసా డబ్బులు చెల్లించాలని నల్గొండ జిల్లా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కి గోలి మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని, రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా సాక్షిగా మున్సిపల్ ఎలక్షన్ల తర్వాత జమ చేస్తారని మాట ఇచ్చారు ఇంతవరకు అది అమలు కాలేదు కావున వెంటనే రేవంత్ రెడ్డి మాట నిలుపుకోవాలని సూచించారు అదేవిధంగా రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నవీన్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, వెంకన్న, వెంకటరెడ్డి, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు

## శిల్పారామం లో ఆకర్షించిన ఖాది మహోత్సవం మరియు కూచిపూడి నృత్య ప్రదర్శన.....

హైటెక్ సీటీ ప్రభాత సూర్య : శిల్పారామం మాదాపూర్ లో ఖాదీ మహోత్సవ 2026 సందర్భంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీమతి నళిని గాజుల శిష్య బృందం లలిత సంగీతం మరియు కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. శ్రీవల్లి లలిత సంగీతం ఆలపించారు. మూషిక వాహన, బ్రహ్మాంజలి, విన్యకకౌతం, జావళి, జయము జయము, జనుత శబ్దం, దశావతరాలు, జతిస్వరం, మహేశ్వరి, పదం అంశాలను కళాకారులూ శ్రీనిధి, కీసర, కృతిక, శ్రేష్ఠ, నిహిర , జోషునిక, ధాత్రి, లాస్య, శాన్విక, హిమజ, శృతి, ప్రణమ్య, హరిణి , ఆద్య, అద్రితి, అక్షయ, హరిణి, షణ్ముఖ ప్రియా మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



# వ్యక్తి గత కక్షలతో ఊరి పరువు తీస్తున్నరు

**● 20 ఏళ్ల క్రితమే 3ఫీట్ల రోడ్డును ఆ ఇద్దరు సగం సగం కలుపుకున్నారు ● ఈ రోడ్డుతో గ్రామ పంచాయతీకి ఎలాంటి ఉపయోగం లేదు ● గ్రామస్తుల ఆవేదన**

**ప్రభాత సూర్య ,జిల్లా ప్రతినిధి :** నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పాములపహాడ్ గ్రామం రోజుకో పంచాయతీ, రోజుక వార్తతో ఇద్దరి వ్యక్తుల వ్యక్తి గత కక్షలు ఊరి పరువును రచ్చకెక్కించారంటూ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పాములపహాడ్ గ్రామంలోని పశువుల దావఖనకు ఎదురుగా వున్నా దారికి ఆనుకొని ఇండ్లు ఉండగా దాని పక్కనే 3ఫీట్ల దారి వారి ఇండ్లనే ఆనుకొని ఉండేది. కాగా ఈ దారితో గతంలో కాని ఇప్పుడు కాని గ్రామపంచాయతీకి ఎలాంటి ఉపయోగం ఉండేది కాదు, దీనిని గ్రామంలో కూడ ఎవరు పట్టించుకోలేదు. అయితే దీనిని గతంలో 20 ఏళ్లక్రితమే ఆ దారికి ఆనుకుని ఉన్న ఆ ఇద్దరి కి మాత్రమే ఉపయోగ ఉండేది అయితే అప్పట్లో ఒకరు సగభాగం, మరొకరు సగభాగం దారిని కలపేసుకున్నారు. కాగా ఈ మధ్యనే ఒక వ్యక్తి ఇళ్లు పనులు మొదలు పెట్టుకున్నాడు. దీనిని చూసి ఆ ఇద్దరికీ తరుచుగా గోడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఓ వ్యక్తి అది గ్రామ పంచాయతీకి సంబంధించిన దారి అని మరో వ్యక్తి దానిని కబ్జా చేశాడు అంటూ అధికారులకు ఫిర్యాదు, పత్రికల్లో వార్తలు, సోషల్ మీడియాలో పోస్టులు చేయడం ప్రారంభించారు. ఇదీ కాస్తా జిల్లా, మండల పరిసర ప్రాంతాల్లో ఊరి సమస్య వైరల్ గా మారింది...

**అధికారుల ప్రమేయం లేదు, దారితో గ్రామ పంచాయతీకి ఉపయోగం లేదు**




వీరు కబ్జా చేసి 20 సంవత్సరాలు కావస్తున్న ఈ దారి వల్ల ఊరికి ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో అధికారులు గాని, గ్రామ సర్పంచ్ కాని, ప్రజలు స్పందించలేదు. కాగా వీరికి గొడవలు వ్యక్తిగత కక్షలతో గిచ్చి ఖయ్యం పెట్టుకున్న చందంగా ఈ దారిపై అధికారులకు ఫిర్యాదులు, రోజుకో పంచాయతీతో ఊరిలో ప్రశాంతత లేకుండా చేస్తున్నారని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరి వల్ల వేరే ఊరికి వెళ్లాలన్న మొహం చూపలేకపోతున్నామని కలత చెందుతున్నారు. అంతే గాకుండా రోజుకో ఫిర్యాదుతో అధికారుల పని తీరుపై పత్రికల్లో ఊరికి సంబంధించి కథనాలు రావడం తమను బాధకుగురి చేస్తుందని తెలిపారు. ఏదేమైన ఇద్దరి వ్యక్తుల అనాలోచిత నిర్ణయాల వల్ల ఊరి పరువు నడి బజారునకు తేవడంతో తలెత్తుకోలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు....

# రైతులకు సరిపడా యూరియా నేరుగా సరఫరా చేయాలి

**యూరియా బుకింగ్ యాప్ ను ఎత్తివేయాలి.. రైతులకు శ్రేయస్సుకోసం.. న్యాయపోరాటం చేస్తా**

**మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి**

**మిర్యాలగూడ ఫిబ్రవరి 23:- (ప్రభాత సూర్య):** రైతులను ఇబ్బందిపాలు చేస్తున్న, సకాలంలో అందించలేని యూరియ బుకింగ్ విధానాన్ని ఎత్తివేయాలని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో రైతుల శ్రేయస్సుకోసం, ఒక రైతుగా హై కోర్టులో న్యాయపోరాటం చేస్తానని మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైతుబంధు సమితి నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి యాసంగి సీజన్లో ప్రతి ఎకరాకు 3బస్తాల యూరియా తప్పనిసరని అన్నారు. తనకు 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, యూరియా యాప్ ద్వారా దరఖాస్తు చేయగా కేవలం 12 యూరియా బస్తాలే సరఫరా చేశారని, మిగిలిన యూరియా బస్తాలు నేటికీ అందలేదన్నారు. 15 రోజుల తర్వాత మరోసారి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సలహా ఇచ్చారని, తద్వారా తీవ్ర పంట నష్టం, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. యూరియా నమోదు యాప్ దరఖాస్తు చేసే సమయంలో సెకండ్స్ లలో యాప్ తొలగిపోతుందన్నారు. సుమారు 90 శాతం మంది రైతులు స్మార్ట్ ఫోన్లు లేనివారు ఉన్నారని, అక్షరాస్యత లేని, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియదన్నారు. యాప్ ద్వారా యూరియా కొనుగోలు కంటే ట్రాన్స్ పోర్ట్ చార్జీల ధర ఎక్కువైతుందన్నారు. చిన్న రైతులకు, ఎన్నారై రైతుల భూములను కౌలు చేసే రైతులకు యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. యూరియా బుక్ చేసుకుంటే ఓటిపి ఎన్నారైలకు వెళుతుందని, ఆలోపే యూరియా స్టాక్ లేదని, యాప్,తొలగిపోతుందన్నారు. తరచుగా ఆన్ లైన్ లో సర్వర్ వైఫల్యాలు సాంకేతిక లోపాలు సంభవిస్తున్నాయన్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యూరియా బుకింగ్ కోసం ప్రయత్నించిన సమయంలో



ఆన్ లైన్ బిజీగా ఉండి నమోదు చేసుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. యూరియా యాప్ నుండి అసైన్డ్ భూములకు పూర్తి మినహాయింపు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాప్ లో అసైన్డ్ ల్యాండ్ ఆప్షన్ లేకపోవడం వల్ల అసైన్డ్ భూములు సాగు చేసుకునే రైతులు యూరియాకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటలు పొట్ట దశ కంటే ముందే యూరియా అవసరం చాలా ఉందని, చాలామంది రైతులకు పొట్ట దశలో ఉన్న పంటలకు ఒక యూరియా బస్తా కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కావలసినంత యూరియా వెంటనే అందించాలని, లేకుంటే పంటల దిగుబడి తగ్గుతుందని, రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని వెంటనే యూరియా బుకింగ్ యాప్ ను ఎత్తివేయాలని, రైతులకు సరిపడా యూరియాను అందించాలని యాప్ లో అసైన్డ్ ల్యాండ్ ఆప్షన్ లేకపోవడం వల్ల అసైన్డ్ భూములు, ఎన్ఆర్ఐ భూములు సాగు చేసుకునే రైతులు యూరియాకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటలు పొట్ట దశ కంటే ముందే యూరియా అవసరం ఉందని, పొట్ట దశలో ఉన్న పంటలకు ఒక యూరియా బస్తా కూడా చాల మంది రైతులకు అంద లేదన్నారు. రైతులకు కావలసినంత యూరియా వెంటనే అందించాలని, లేకుంటే పంటల దిగుబడి తగ్గుతుందని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని వెంటనే యూరియా యాప్ ను ఎత్తివేయాలని, రైతులకు సరిపడా యూరియాను అందించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్, నల్గొండ జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారిలకు వినతి పత్రాలను అందజేశామన్నారు. రైతులకు న్యాయంకై రైతుల పక్షాన హై కోర్టులో న్యాయ పోరాటం చేసేందుకు వెనకాడనని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో రైతు ప్రతినిధులు హాతిరాం నాయక్, మాజీ సర్పంచ్ ఎం.రవీందర్ నాయక్ ఉన్నారు.

# ఎస్పీటీయు సమీప డంప్ యార్డ్‌ను తక్షణం తరలించాలి

**నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కి జర్నలిజం విద్యార్థుల వినతిపత్రం సమర్పణ**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాత సూర్య):** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త డంప్ యార్డ్‌ను తక్షణమే అనుకూల ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేస్తూ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతినిధుల బృందం సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టి.లక్ష్మణ్ గౌడ్ ప్రధానంగా పాల్గొని విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతంలో డంప్ యార్డ్ కారణంగా తీవ్ర దుర్వాసన, వాయు కాలుష్యం,దోమలు మరియు వ్యాధికారక పరిస్థితులు నెలకొంటున్నాయని, విద్యార్థుల ఆరోగ్యానికి శాంతమైన విద్యావాతావరణానికి ఇది ముప్పుగా మారిందని తెలిపారు. విశ్వవిద్యాలయం సమీపంలో చెత్త నిల్వ చేయడం పర్యావరణ ప్రజారోగ్య ప్రమాణాలకు విరుద్ధమని, సమస్యను తక్షణమే పరిష్కరించడం మున్సిపల్ అధికారుల బాధ్యత అని. డంప్ యార్డ్‌ను విద్యార్థులు, అధ్యాపకులు మరియు ప్రాంత వాసుల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణమైన ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి ని అందచేశారు. విద్యార్థుల ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌కి కింద సూచనలను సమర్పించారు. ప్రతి కేంద్రంలో క్రమపద్ధతిగా శుభ్రత మరియు సీసీటీవీ పర్యవేక్షణ నిర్వహించాలి. తాత్కాలికంగా దుర్వాసన నివారణ చర్యలు చేపట్టాలి. శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించి డంప్ యార్డ్‌ను తరలించాలి. ఈ సందర్భంగా




లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ సమస్యపై సమయానుకూలంగా స్పందించాలనీ విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమములో రామకృష్ణారెడ్డి,యం.పి కేశవమూర్తి,ఏఐఎస్ఓ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జి.రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో సాగు,త్రాగునీరు,మూసీ కాలుష్యం,విద్య,వైద్యం, రహదారులు, ఉపాధి,

# మౌలిక అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్






**భువనగిరి, ఫిబ్రవరి 23(ప్రభాత సూర్య ):** మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే 2026 - 27 వార్షిక బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లా సాగు , త్రాగునీరు కోసం , మూసీ జల కాలుష్య నివారణకు, విద్య , వైద్యం, రహదారులు , ఉపాధి, మౌలిక అంశాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. సోమవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 - 27 వార్షిక బడ్జెట్ లో జిల్లా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు " ధర్నా " కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ కి మెమోరండం ఇచ్చినారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత కీలకమైన బస్వాపురం ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి ఈ బడ్జెట్ లో 500 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు 90% పైగా పూర్తయిందని మిగతా పని పూర్తి కావాలన్నా , నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందాలన్నా వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయితే 10 మండలాలలోని లక్ష ఎకరాలకు పైగా భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. మరోపక్క డిండి ఎత్తిపోతల పరిధిలోని శివన్నగూడెం ప్రాజెక్టు పనులకు, నిర్వాసితు నష్టపరిహారానికి కూడా నిధులు కేటాయించని అన్నారు. నారాయణపురం మండలానికి సంపూర్ణంగా నీళ్లు ఇవ్వడం కోసం రాచకొండ ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలని సూచించారు. గంధమల్ల ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించామని ప్రభుత్వం చెప్తుందని కేవలం కొంతమంది భూ నిర్వాసితులకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చారని మిగతా నిర్వాసితులతో పాటు ప్రాజెక్టు పనులకు కూడా నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి మూసీ ప్రక్షాళ చేసి రసాయన పరిశ్రమల కాలుష్యం, వ్యర్ధాలు, మురికి నీరు కలవకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి సంవత్సరంపైగా గడుస్తున్న ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. ఇప్పటికైనా సంగెం, నెమిలెకాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వల పరిధిలలో ఎస్.టి.పి ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నేటికీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలు లేవని ఈ బడ్జెట్ లో నన్న తగిన నిధులు కేటాయించి భువనగిరి జిల్లా కేంద్రంతో పాటు చౌటుప్పల్ పట్టణంలో కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ ఎక్యుప్ మెంట్స్, లాప్రోస్కోపీ మొదలగు పరికరాల కొనుగోలుకు సమగ్ర నిధులు ఇవ్వాలని కోరారు. యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ భవనం త్వరితగతిన పూర్తి చేసి రామన్నపేట, మోత్కూరు, ఆలేరు మండల కేంద్రాలలో వంద పడకల ఆసుపత్రుల నిర్మాణానికి తగిన నిధులు బడ్జెట్లో కేటాయించాలని అన్నారు. చిట్యాల - భువనగిరి ప్రధాన రహదారి విస్తరణకు తగిన నిధులు కేటాయించి ప్రజలను కాపాడాలని, ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నిధులు కేటాయించి ప్రకటించాలని, గ్రామీణ అంతర్గత రోడ్లు, దళిత వాడలు, గిరిజన తండాల అభివృద్ధికి నిధులు కేటాయింపు, జిల్లా కేంద్రంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఇన్స్ పెక్టర్ ఆఫీస్, డి.సి.ఎల్ ఆఫీస్, పి.ఎఫ్. ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసులు మంజూరు చేసి ఈ బడ్జెట్ లోనే నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినారు. నిధుల సాధనకు జిల్లాలో ఉన్న ఐదుగురు కాంగ్రెస్ శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలని జహంగీర్ వారికి సూచించినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా , బట్టుపల్లి అనురాధ పాల్గొని మాట్లాడగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బొలగాని జయరాములు, మాయ కృష్ణ, గంగాదేవి సైదులు, ఎంఎ. ఇక్బాల్, మధ్యపురం రాజు, ఆలేరు మండలం కార్యదర్శి ధూపాటి వెంకటేష్, బొమ్మలరామారం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, తుర్కపల్లి మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి తోపాటు ఈర్లపల్లి ముత్యాలు, లావుడియా రాజు, వనం రాజు, గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, కొండమడుగు నాగమణి, చింతల శివ, బర్ల వెంకటేష్, కొండాపురం యాదగిరి, ఉస్మాన్ షరీఫ్, వల్దాస్ అంజయ్య, ఎదునూరి వెంకటేష్, బోడ అంజయ్య, ఎండి. బాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి నగర్ వన్ లో నెలకొన్న త్రాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి

**ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ని, అధికారులను కలసిన ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాచర్ల విష్ణు**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ వన్ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి కొరత, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీని, వాటర్ వర్క్స్ అధికారులను కలిసి సమస్యలను వివరించారు. ప్రగతి నగర్లోని రోడ్ నెంబర్--2, రోడ్ నెంబర్--3, రోడ్ నెంబర్--5 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, అండర్ గ్రౌండ్ లైన్లలో తరచుగా సమస్యలు తలెత్తడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూకట్పల్లి డివిజన్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరిశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస రాజు, వివేకానంద నగర్ సెక్షన్ మేనేజర్ ప్రియాంకలతో కూడిన అధికారులను కలిసి సమస్యలపై చర్చించారు. ప్రాంతంలో తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు మాట్లాడుతూ "ప్రజలకు తాగునీరు ప్రాథమిక అవసరం. ఎండాకాలం ప్రారంభమయ్యేలోపు సమస్యలను పరిష్కరించకపోతే ఇబ్బందులు మరింత పెరుగుతాయి" అని అన్నారు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమస్యలను గమనించి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. స్థానికులు సమస్యల పరిష్కారంపై వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ శ్రీరాముల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రఘు గౌడ్, కోశాధికారి ఆర్. శంకర్ రావు, బాలరాజు, అనిత, వాణి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి - నల్గొండ జిల్లా నిరుద్యోగ జేఏసీ

**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణ కేంద్రంలో సోమవారం నల్గొండ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం నుండి మంత్రి క్యాంప్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ నల్గొండ నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి రామరాజు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆనాటి పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఏడాదికి రెండు లక్షల ఉద్యోగం నోటిఫికేషన్ ఇస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఎన్నికలలో మరియు మ్యానిఫెస్టో లో ప్రకటించారు. రెండు లక్షల ఉద్యోగులు ఎక్కడ పోయినయి అని, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంకా ఎంతమంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవాలి, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు మనో ధైర్యం కల్పించి అండగా నిలవాలని కోరారు. నిరుద్యోగ జేఏసీ కి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కారింగ్ మహేష్ గౌడ్, ఇంద్ర, భూక్య కుమారి క్రాంతి, కిరణ్, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గానికి ఘన సన్మానం



**పెబ్బేరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో గల ఏడవ వార్డులోనీ శ్రీ నిత్య నిర్మలచల రాజయోగ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పెబ్బేరు మున్సిపల్ నూతన చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు. జమ్ములమ్మ. భాగ్యలక్ష్మి. తాటికొండ కృష్ణ. శివ సాయి. ఎండి పర్వీన్ ను పెబ్బేరు ఆశ్రమ కమిటీ అధ్యక్షులు మోతే రాముడు వారి సహోదరులు, భక్త బృందం శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పెబ్బేరు పట్టణంలో 1992 నుండి పెబ్బేరు నిత్యనిర్మలచల రాజయోగ ఆశ్రమం నడపబడుతున్నది. ఇట్టి కార్యక్రమానికి వేలాదిగా భక్తులు వస్తున్నారన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాలు, భజనలు , ఆధ్యాత్మిక సేవలు అభినందించదగ్గవని, వారి సేవలను ప్రశంసించారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో వారితోపాటు హిందూ ఆధ్యాత్మిక, ధార్మిక సేవలో సభ్యునిగా ఉంటూ తాను కూడా పాల్గొన్నట్లుగా, ఇకముందు కూడ సానుకూలంగా మా వంతు సహకారం ఎల్లప్పుడూ అందుతుందని చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు మోతే రాముడు ఆశ్రమంలో నెలకొన్న పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా మునిసిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, నూతన కౌన్సిలర్లుసానుకూలంగా స్పందించారు. తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడు ఆశ్రమానికి అందుతుందని ఆశ్రమ కమిటీ అధ్యక్షులు మోతే రాముడకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోతే వారి కుటుంబ సభ్యులు, మాజీ వార్డ్ నెంబర్ లలితమ్మ. లక్ష్మీకాంత్. రఘు. చిన్న రఘు ఆశ్రమ భక్త బృందం, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ లో గీతం విద్యార్థికి మూడు బంగారు పతకాలు

**పికిల్ బాల్ పోటీలలో ప్రతిభ చాటిన బీ.ఆర్క్. విద్యార్థిని ఆశ్రిత రాజు**






**పటాన్చెరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** మండలం లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని బీ.ఆర్క్. తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు తెలంగాణ ముఖ్యమంత్రి కప్ 2025-26 పికిల్ బాల్ పోటీలలో ప్రతిభ చాటి మూడు బంగారు పతకాలను గెలుచుకుంది. సీఎం కప్ రెండో ఎడిషన్ తుది దశ పోటీలను ఫిబ్రవరి 20-21 తేదీలలో హైదరాబాదులోని లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో నిర్వహించారు. పికిల్ బాల్ ఉమెన్స్ సింగిల్స్, ఉమెన్స్ డబుల్స్, మిక్స్ డ్ డబుల్స్ పోటీలలో ఆశ్రిత నెగ్గి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంటును తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జనవరి 8 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఈ ఛాంపియన్ షిప్ లో హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బిలియర్డ్స్, ఫెన్సింగ్, లాన్ టెన్నిస్, పికిల్ బాల్ వంటి పోటీలను బహుళ-స్థాయి ఫార్మాట్ లో జరుపుతున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రారంభమై, తరువాత మండల, పట్టణ స్థానిక సంస్థల రౌండ్లను నిర్వహించారు. చివరిగా హైదరాబాదులో రాష్ట్ర స్థాయి ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. ఆశ్రిత రాజు సాధించిన అద్భుతమైన విజయానికి గీతం నాయకత్వం అభినందనలు తెలియజేసింది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు ఆమె అంకితభావం, క్రమశిక్షణ, క్రీడా నైపుణ్యాలను ప్రశంసించారు. భవిష్యత్తు పోటీలలో కూడా గొప్ప మైలు రాళ్ల కోసం కృషిచేయాలంటూ ఆమెను ప్రోత్సహించారు.గీతం కమ్యూనిటీ ఈ విజయం పట్ల అపారమైన గర్వాన్ని వ్యక్తం చేసింది. ఇటువంటి విజయాలు విద్యా నైపుణ్యంతో పాటు క్రీడా స్ఫూర్తి, జట్టు కృషి, సమగ్ర అభివృద్ధిని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తాయని పేర్కొంది.

# వన్ టైం రిజిస్ట్రేషన్ గడువు మరో పది రోజులు పొడిగించండి

### తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్




**ప్రభాత సూర్య మాడుగుల పల్లి మండలం (పిబ్రవరి 23)ప్రతినిధి :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 25 వరకు గడువు విధించారని ఆ యొక్క గడువును మరో 10 రోజులు పొడగించాలని కోరుతూ ఈరోజు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా లింగమ్ గౌడ్ మాట్లాడుతూ గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు కూడా తప్పకుండా తిరిగి వారి యొక్క వివరాలన్నింటిని విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడంతో అందరూ ఒకేసారి అప్లోడ్ చేసుకునే సమయంలో సర్వర్ బిజీ అని వస్తుంది కావున కేవలం రెండు రోజుల సమయం ఉన్నందున ఇంకా ఈ సమయాన్ని పది రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



# సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని

**నల్గొండ ప్రభాత సూర్య :** నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ లంబాడా ,గిరజన జాతిలోని మూఢనమ్మకాలను పారద్రోలి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో రూపొందించిన రాజ్యాంగం, హక్కులు ,ప్రభుత్వ పథకాలను పేద, నిమ్న వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు .ఎస్టీ, బంజారాలకు సమాజ స్థితిగతులను తెలియజేశారని, సంత్ సేవాలాల్ నీతి,న్యాయం , ధర్మాన్ని పాటించాలన్న వారి మార్గదర్శకాలను ,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువని, సేవ, ధర్మం సమ భావనలను బోధించారని, సత్సంగ్ ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో పయనించేందుకు కృషి చేశారని అన్నారు. సమావేశానికి ప్రవీణ్ నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడగా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, లంబాడ హక్కుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్,ఎరుకల సంఘం అధ్యక్ష్యులు నరసింహ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ ,తహసిల్దార్ పరశురాం ,కార్పొరేటర్లు దీప్లా నాయక్, నాగార్జున, రవి నాయక్, ఇతర లంబాడా సంస్థల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మేయర్ , డిప్యూటీ మేయర్, తదితరులు సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## కొల్లూరులో కాశి విశ్వేశ్వర ఆలయంలో భక్తుల కోరిక మేరకు సొంత ఖర్చులతో బోరు వేయించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి ...



**ఆలేరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో సోమవారం రోజున కాశీ విశ్వేశ్వర ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడి లోపల భక్తులకు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి ఇబ్బంది కలగకుండా గుడి ప్రాంగణం లోపల తన సొంత ఖర్చులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా భక్తులు హర్షం వ్యక్తం చేశారు. బోరు వేయించినందుకు వారికి భక్తులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ భక్తులు ఇబ్బంది పడకుండా వారి కోరిక మేరకు తన సొంత నిధులతో బోరు వేయించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ గాజుల దశరథ, మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గ్యాదపాక దీప, వార్డు మెంబర్లు ఎండి మస్తాన్, మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య, శివరాత్రి లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు గ్యాదపాక యాదగిరి, బాలరాజు మల్లేష్, సుధాకర్, గాజుల సుధాకర్ కర్ణాకర్ ఇమ్రాన్ , అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికవేత్త సంత్ రవిదాస్ .. పోస్టర్ ఆవిష్కరణ

**ఆలేరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** గొప్ప ఆధ్యాత్మికవేత్త, కవి, సంఘసంస్కర్త సంత్ రవిదాస్ యొక్క జయంతిని పురస్కరించుకుని ఆయన పోస్టర్ ఆవిష్కరణ స్థానిక శ్రీ రామకృష్ణ విద్యాలయంలో జరిగింది. సామాజిక సమరసత వేదిక, యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలభారత కళాప్రముఖ్ మరియు తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ కులమతాలు లేవని, పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదని, అందరూ సమానమేనని, చేసే కర్మల వల్ల మాత్రమే గౌరవం లభిస్తుందని, భగవంతుని చేరుకోవడానికి ఆడంబరాలతో కూడిన పూజలు అక్కర లేదని, నిశ్చలమైన భక్తి ఉంటే చాలునని సంత్ రవిదాస్ బోధనలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత కళాప్రముఖ్ బండిరాజుల శంకర్, జిల్లా కన్వీనర్ పులమేని అంబేద్కర్, ఆలేరు మోచీ సంఘం అధ్యక్షులు బెదరకోట దుర్గేశ్, సభ్యులు చంద్రగిరి రమేశ్, చంద్రగిరి లింగం, అలిసేరి వెంకటేశ్, ఉపాధ్యాయులు తరిగొప్పుల రమేశ్, నారగోని భీమేశ్, బొడ్డు రమేశ్, జూకంటి సిద్ధులు, పిస్కె గణేశ్, పంతంగి శివ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

## పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్, సబ్ కలెక్టర్ అమిత్







**మిర్యాలగూడ ఫిబ్రవరి 23:-( ప్రభాత సూర్య):** అల్ ఇండియా బంజారా సేవా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలోశాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ ,సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ గిరిజన నాయకులు, కమిటీ సభ్యులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయం నుండి మొదలై బంజారా భవన్ వరకు సేవాలాల్ మహారాజ్ స్వామి ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంత్ సేవాలాల్, రాగ్యానాయక్ బంజారా భవన్ లో గిరిజన సంప్రదాయ బద్దంగా భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం మినీ రవీంద్ర భారతి నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ గోర్ బంజారా సమాజాని కి నిజమైన దైవం, ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ 18వ శతాబ్దంలోనే బంజారాల సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన ఎనలేని కృషి చేసారన్నారు. కర్ణాటకలో జన్మించిన సేవాలాల్ అహింస, శాకాహారం, ధర్మం, క్రమశిక్షణను పాటించాలని బోధించారన్నారు. మతమార్పిడులను, మూఢనమ్మకాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, ఒక గొప్ప దార్శనికుడు. భవిష్యత్తులో వాహనాల వాడకం (ఎడ్లు లేని బండ్లు) నీటి ఎద్దడి గురించి ఆయన ఆనాడే చెప్పారు. అంత ముందు చూపు కలిగిన మహా జ్ఞానీ వారని అన్నారు. సేవాలాల్ మహారాజ్ మనకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు. ఆయన తండాల అభివృద్ధికి, విద్యకు, స్త్రీల గౌరవానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని అయన అన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపిన అహింసా మార్గంలో నడుస్తూ, బంజారా సమాజం విద్యావంతంగా, ఆరోగ్యంగా, ఐకమత్యంతో ముందడుగు వేయాలన్నారు. ఆయన ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అందరికీ తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. నేను గిరిజన జాతికి చెందిన బిడ్డను కాకపోయినా మిర్యాలగూడ గిరిజన సోదర సోదరిమణులు అందరూ నన్ను వారి సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకుంటూ నాతో పాటు నడిచి ఈరోజు నన్ను శాసనసభ్యుడిగా నిలబెట్టారని వారి ఋణం నేను ఇప్పటికి మరచిపోను వారికి వారి కుటుంబాలకు, నా ఊపిరి ఉన్నంతవరకు అండగా ఉంటానని ఆయన అన్నారు. ప్రజాప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. మన గిరిజన నాయకుడు శంకర్ నాయక్ కు ఎమ్మెల్సీ తో పాటు, కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్మన్ పదవిని కూడా ఇచ్చి గిరిజనులను గౌరవించిందని ఆయన అన్నారు. ఆరాధ్య దైవం బంజారాలకే మాత్రమే కాదు నాకు కూడా ఆరాధ్య దైవమైన్నారు. సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అందరితో కలిసి జరుపుకుంటునందుకు నేను అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. అనంతరం గిరిజన నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం గిరిజన నాయకులు డి.స్కై ల్యాబ్ నాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొర్ర నాగునాయక్, డి.రవితేజనాయక్, సిద్ధూనాయక్, శారద, గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నానిక్యనాయక్, కృష్ణానాయక్, ఎం.దశరదనాయక్, వెంకట్రాంనాయక్, తహసీల్దార్లు పి. శ్రీనివాస్, డి.జవహరలాల్ నాయక్, రాగ్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్, ఎంపీడీఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపిఓ మాతంగి సురేష్, కాంగ్రెస్ నాయకులు చిరుమరి కృష్ణయ్య, పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి,నాయకులు డి.శేఖర్ రెడ్డి, తాళ్లపల్లి సురేష్,, బిఆర్ఎస్ నాయకులు డి.రవినాయక్, ఎ. హాతీరామ్, ఎం.రవీందర్నాయక్, సిపిఎం నాయకుడు ఎర్రనాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో ఫిర్యాదు ల ను వెంటనే పరిష్కరించండి...

### జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే...

శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : శేరిలింగంపల్లి జోన్వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయం తోపాటు నర్సింగ్ ,అమెన్పూర్ , పటాన్చెరువు, మియాపూర్ శేరిలింగంపల్లి సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాగా మొత్తం 19 వినతులు అధికారులకు అందాయి .ఇందులో జోనల్ కార్యాలయంలో 4, శేర్లింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 9, నర్సింగ్ సర్కిల్ కార్యాలయంలో 1 , మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో 3 మరియు అమెన్పూర్ సర్కిల్ 2 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.




# అగ్రవర్ణ రెడ్లను తక్షణమే శిక్షించాలి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని వారిని అరెస్టు చేయాలి
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగేది లేదు
- బిసి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఐతరాజు అభయందర్
- తెలంగాణ రజక పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సింగారం ఉప్పలయ్య
- రజక సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరిగల రమేష్
- రజక సంఘం రాష్ట్ర నాయకులు మాదరాజు యాకన్న.
- రజక చైతన్య వేదిక అధ్యక్షులు గంపల శ్రీనివాస్
- రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉల్లంగుల నరసయ్య

**నాగర్ కర్నూలు, ఫిబ్రవరి 23(ప్రభాత సూర్య ):** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో అమానవీయంగా ప్రవర్తించి రజక కుటుంబం పై దాడి చేసి రెండు నెలల పసిబిడ్డను కాలితో పాసవికంగా తన్ని పసిపాప చావుకు కారణమైన అగ్రవర్ణ రెడ్డి కుటుంబాలను తక్షణమే అరెస్ట్ చెయ్యాలని , ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా పోలీసుల అరెస్ట్ చేయకపోవడం విస్మయానికి గురిచేస్తుందని. ఈ విషయం పై తక్షణమే ప్రభుత్వం స్పందించి నిందితులపై మర్డర్ కేసు తో పాటు మర్డర్ కేసు ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు పెట్టాలని దానితోపాటు బాధితులకు 50 లక్షల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, సొంత ఇంటిని కల్పించాలని బీసీ పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు ఆభయందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు ఇప్పటికి స్పందించకపోవడం బాధాకరమని రజక సంఘాల చైతన్య సమితి నాయకులు ఉప్పలయ్య తెలిపారు రజక కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదని రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని రజక చైతన్య వేదిక అధ్యక్షులు గంపల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని లేని పక్షంలో మానవహక్కుల కమిషన్ కి పౌరహక్కుల సంఘాలకు పిర్యాదు చేసి రజక కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని రజక సంఘాల జేఏసీ ప్రధానకార్యదర్శి సూరిగళ్ల రమేష్ తెలియజేసారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు యాకన్నా మాట్లాడుతూ రజకులకు పోరాటమనేది కొత్తకాదు దొరల మీద పోరాటం చేసినటువంటి ఘనత మా చాకలి కులానిది వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం చేసిందే విసునూరు దొర రామచంద్రారెడ్డి మీద ఆరోజు పెత్తందారి రెడ్లని తరిమిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఈ రెడ్లపై మరోపోరాటానికి సిద్ధమవుతామణి హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉల్లెంగుల నరసయ్య వరంగల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ కులాలను ఓటు బ్యాంకు గానే గుర్తిస్తుంది తప్ప ఈరోజు జరిగిన నాగర్ కర్నూల్ కుమ్మెర గ్రామంలో రజక కుటుంబం పై దాడిని అగ్రవర్ణాలు దాడిని ఇందులో భాగంగానే చూపిస్తున్నదే తప్ప అగ్రవర్ణాలకు శిక్ష పడకుండా తప్పియ్యడానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వము బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం చొరవ తీసుకొని రజక కుటుంబానికి న్యాయం చేయాలని కోరడం జరుగుతుంది .ఈ కార్యక్రమం లో యాదాద్రి జిల్లా నాయకులు భాను చందర్ ,వెంకన్న, యాదయ్య, విజయ్, శేఖర్, రాజు బీసీ ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా జగిని 69 వ వార్షికోత్సవం

**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణం సోమవారం ప్రకాశం బజార్ లో ఉన్న జగనీ షాపింగ్ మాల్ ను 1957 సంవత్సరమున ఏర్పాటు చేశారు. నేటికీ స్థాపించి సోమవారం 69 వ వార్షికోత్సవం కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. జగిని వారు ఎన్నో సామాజిక సేవలు చేశారని చలివేంద్రాలు ఏర్పాటు, మట్టి వినాయక విగ్రహాలు, రక్తదానాలు, పేద ప్రజలకు ఎంతోమందికి అండగా నిలిచారని తెలిపారు. అదేవిధంగా అనంతరం అదేవిధంగా ఏఎస్పీ జీ.రమేష్,, ఆర్డిఓ అశోక్ రెడ్డి,,డీఎస్పీ శివరాం రెడ్డి, మాట్లాడారు జగినికి 69వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు సామాజిక సేవలో ముందుంటారని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. వ్యాపారమే కాకుండా ప్రజాసేవలో ముందు ఉంటారని. కస్టమర్ల ఆశీస్సులు ఉండాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు జగిని సిబ్బంది, కస్టమర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి .......



**ఆలేరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :** ఆలేరు లో సోమవారం రోజున స్థానిక రహదారి బంగ్లాలో మాజీ ప్రభుత్వ విప్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్లను ఒకటో వార్డు పాకాల మౌనిక హరీష్. మూడో వార్డు యాట శివ. నాలుగో వార్డ్ బీజని కళ్యాణి మధు లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. 420 హామీలు నెరవేర్చలేని ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మొరిగాడి మాధవి వెంకటేష్ గౌడ్. మాజీ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఆడెపు బాలస్వామి. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, మాజీ కౌన్సిలర్ బేతి రాములు ,పాషికంటి శ్రీనివాస్ కుంతాటి అంజన్, మాజీ కోఆప్షన్ సభ్యులు సీస రాజేష్ గౌడ్ ,వార్డు అధ్యక్షులు సీస సత్తయ్య గౌడ్, ఎండి ఫయాజ్ ,ఆంజనేయులు ,మొరిగాడి సుజాత, టింకు ,బెదరకోట దుర్గేష్, దుడక గణేష్ ,గట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ వెనుకవైపులా ఢీ కొట్టిన బైకు యువకుడు మృతి





**పెబ్బేరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య:** పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ వయస్సు 25 సంవత్సరాలు. సాయంత్రం అందాజా ఏడున్నర గంటల సమయంలో అయ్యవారిపల్లె నుంచి తన సొంత ఊరు పాతపల్లి వస్తుండగా పాతపల్లి స్టేజి లో ట్రాక్టర్ కట్టెల లోడుతో వెనక భాగంలో ఎలాంటి సిగ్నల్స్ లేకుండా వెళ్తుండగా వెనుక భాగంలో బైకు ఢీకొట్టడం వల్ల కిషోర్ కుమార్ కు తలకు గాయాలవడం జరిగింది. వెంటనే అతన్ని సరోజినీ ఆస్పటల్ తరలించారు. అక్కడినుండి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ కిషోర్ కుమార్ చనిపోయినట్లుగా వైద్యులు తెలిపారు. మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు

# ఇంద్రేషం లో మున్సిపల్ అధికారుల అండ దండల తో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు

### టౌన్ ప్లానింగ్ సెక్షన్ లోని అధికారులందరి పూర్తి సహకారం తో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు.

### టౌన్ ప్లనింగ్ సెక్షన్ కి బిల్డర్ల ద్వారా పెద్ద మొత్తం లోనే ముడుపులు అందినట్టు , గుసగుసలువినిపిస్తున్నాయి .



**పటాన్చెరు ఫిబ్రవరి 23 ప్రభాత సూర్య :**మండలం లోని ఇంద్రేషం లోని, పి. ఎన్. ఆర్. వెంచర్ లో నవ్య వెంచర్లలో మరియు ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో అక్రమ బహుళ అంతస్తులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇంద్రేశం గ్రామపంచాయతీ నుండి మున్సిపల్ కు మారి దాదాపు సంవత్సరకాలం కావస్తున్నప్పటికీ ఈ అక్రమ బహుళ అంతస్తులు జోరుగానే కొనసాగుతున్నాయి. దీనికి కారణం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమా లేక అధికారులకు అందుతున్న ముడుపుల అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా ఈ అక్రమబహుళ అంతస్తులపై ఎన్నో ఫిర్యాదులు వచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నా రు.ఎలం దుకు కారణం టౌన్ ప్లానింగ్ అధికారులందరికి పెద్ద మొత్తం లో ముడుపులు అందుతున్నాయి అనీమాటలు వినిపిస్తున్నాయి. మరియు పత్రికా ముఖంగా ఈ అక్రమ బహుళ అంతస్థులపై ఎన్నో వార్తా కథనాలు వచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు మరియు టౌన్ ప్లానింగ్ సెక్షన్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారుల అండదండలు చూసుకుని బిల్డర్లు రెచ్చిపోయి అక్రమ బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ అక్రమ బహుళ అంతస్తులపై ఉక్కు పాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.



# కుమ్మెర ఘటనపై రాష్ట్రప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి..

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ డిమాండ్

**గండిపేట్, : సూర్య ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కుటుంబానికి చెందిన చిన్నారి మృతికి బాధ్యులపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార అండతో అరాచకాలకు పాల్పడుతూ దైవ దర్శనానికి వచ్చిన అమాయక కుటుంబంపై దాడి చేయడంతో పాటు పాప మరణానికి కారకులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కుమ్మెరలో మానవత్వం మంట కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రజకకులంలో పుట్టిన కారణంగానే చంద్రకళ కుటుంబాన్ని దైవదర్శనం చేయకుండా అడ్డుకోవడం అమానుషమన్నారు. గ్రామ సర్పంచి అహంకారంతో దుర్భాషలాడుతూ ఇంటిల్లిపాదిని అవమానించారని, పసిపిల్లను వదిలివేయమన్నా



వినకుండా క్రూరంగా ప్రవర్తించారని ఆరోపించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకుండా బాధితులపైనే కేసు నమోదు చేయడం దుర్మార్గమని అన్నారు. చిన్నారి మృతికి సంబంధించి బాధితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసులో కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీసి న్యాయం చేయాలని కోరారు. హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో పోలీసుల వైఖరి ఆందోళన కలిగిస్తోందని, సూర్యాపేట జిల్లా చిలుకూరులో జరిగిన దళిత యువకుడు కర్ల రాజేశ్ లాకప్ డెత్ ఘటనపై చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఎస్సీ, బీసీ కులాలకు దైవదర్శనం నిషేధమా అంటూ ప్రశ్నించారు. ఒక సాధారణ సర్పంచికి ఇంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందని,అతని వెనుక ఎవరున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ. 1కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.

# అక్రమంగా అరెస్టు చేసిన బాల్క సుమన్ ను వెంటనే విడుదల చేయాలి - బి ఆర్ ఎస్ వి రాష్ట్ర కార్యదర్శి కట్ట శ్రీనివాస్

**నల్గొండ ప్రభాత సూర్య :** బాల్క సుమన్ అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ అమరవీరుల స్తూపం ముందు నల్ల జెండాలు మరియు ప్లకార్డ్ లతో నిరస తెలియజేసిన బి ఆర్ యస్ వి కార్యకర్తలుఈ సందర్భంగా బి ఆర్ యస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న విద్యార్థి నాయకుడు బాల్క సుమన్ ని ప్రభుత్వం అక్రమంగా అరెస్ట చేసింది. రామగుండం కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లితో పాటు ఆసిఫాబాద్‌లో జైళ్లు ఉన్నప్పటికీ.. వాళ్లను అక్కడ పెట్టకుండా కక్షపూరితంగా 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్ జైలుకు తీసుకువచ్చి పెట్టడం దుర్మార్గం. క్యాతన్‌పల్లిలోని 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. బీఆర్ఎస్, సీపీఐ కూటమిని ప్రజలు గెలిపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును మంత్రి వివేక్ గారు శిరసావహించాల్సింది పోయి, ఇలా ప్రజా తీర్పును కాలరాయడం సరికాదు. కోరం ఉన్నప్పటికీ చైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి, చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, నోటితో చెప్పలేని విధంగా అసభ్యంగా ప్రవర్తించారు. మహిళలపై చేయి చేసుకున్నారు. మహిళలపై దాడి జరుగుతున్నప్పుడు వివేక్ గారు మంత్రి హోదాలో అక్కడే ఉండి కూడా కనీసం పట్టించుకోకపోవడం, కోరం ఉన్నా ఎన్నిక వాయిదా వేసి వెళ్లిపోవడం శోచనీయం.క్యాతన్‌పల్లి మహిళా కౌన్సిలర్ల తరపున రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే కనీసం కంప్లైంట్ తీసుకోలేదు. కౌన్సిల్‌కు మద్యం తాగి వచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లపై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? కారు ధ్వంసం చేసిన వారిపై కేసులు ఉండవు కానీ, మా కౌన్సిలర్లపై మాత్రం అక్రమ కేసులు పెట్టారు. పోలీస్ స్టేషన్లలో అక్రమ కేసులతో అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ గుండాలు స్టేషన్‌కు వచ్చి మరీ కొడుతున్నారు. ఈ రకమైన దాడులు మంచివి కావు. పోలీస్ కవాతు ప్రజలకు రక్షణ కల్పించాలి. ప్రజల్లో విశ్వాసం నింపాలి. క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేయడానికే పోలీసులు కవాతు చేశారు. మాకు స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒక ఎంపీ అన్యాయంగా రెండోసారి తొర్రూరులో ఓటు నమోదు చేసుకొని ఓటు వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. అక్రమంగా పోలీసులను అడ్డం పెట్టుకుని దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. దొడ్డిదారిన పదవులు దక్కించుకునే ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రేవంత్ రెడ్డి గారు.. మీరు ప్రజా ఆమోదాన్ని కోల్పోయారు. కాంగ్రెస్, బీజేపీల మైత్రి ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ నాయకుడు, బీజేపీ ఎంపీ పోలీసులను పట్టుకుని అడ్డగోలుగా బూతులు తిట్టినా ఇప్పటివరకు వారిని అరెస్ట్ చేయలేదు. రాహుల్ గాంధీ గారు ఈరోజు ఢిల్లీలో



తెలంగాణ క్యాబినెట్‌తో రివ్యూ చేస్తున్నారు. దేశంలో ఎక్కడికి పోయినా చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో ప్రజాభిప్రాయాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ రెడ్డికి ఏం చెప్తారు? ఇదేనా రాజ్యాంగాన్ని పరిరక్షించడం అంటే తెలంగాణలో పట్టపగలు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు స్పందించరు రాష్ట్ర ఇంచార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ ఎందుకు నోరు విప్పరు ప్రజాస్వామ్యాన్ని కాపాడండి. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించని అధికారులపై, క్యాతన్‌పల్లి ఇన్సిడెంట్ పైన గవర్నర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. తప్పు చేసిన అధికారుల మీద, ఎన్నికల కమిషన్ మీద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజా తీర్పును కాలరాసినప్పుడు పెద్ద ఎత్తున ఉద్యమాలు వస్తాయి. పోలీసు అధికారులకు మేము చెప్పేదొకటే అధికారం శాశ్వతం కాదు. అన్ని కాలాలు ఒకే తీరుగా ఉండవు. కాలం మారుతుంది, రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. పోస్టింగ్‌ల కోసం నాయకుల చెప్పుచేతల్లో పనిచేయకూడదు. చట్టాన్ని అతిక్రమించి, పరిధులు దాటి బీఆర్ఎస్ నాయకుల పట్ల అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు తీవ్ర మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది. రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది.. అప్పుడు రేవంత్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఎవరూ మిమ్మల్ని కాపాడలేరు. మీరు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చట్టం కాంగ్రెస్ పార్టీకి చుట్టంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు.ఈ కార్యక్రమములో జెట్టి శివప్రసాద్ యాదవ్, కంధుల సంపత్,అంగోత్ బాలాజీ నాయక్,సాయి,గోపాల్,నాణిక్య,మోహన్ రావు, వెంకన్న,సాగర్ తధితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు





**మిర్యాలగూడ ఫిబ్రవరి 23:-( ప్రభాత సూర్య):** అల్ ఇండియా బంజారా సేవా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలోశాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ ,సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ గిరిజన నాయకులు, కమిటీ సభ్యులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయం నుండి మొదలై బంజారా భవన్ వరకు సేవాలాల్ మహారాజ్ స్వామి ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంత్ సేవాలాల్, రాగ్యానాయక్ బంజారా భవన్ లో గిరిజన సంప్రదాయ బద్ధంగా భోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం మినీ రవీంద్ర భారతి నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ గోర్ బంజారా సమాజానికి నిజమైన దైవం, ఆధ్యాత్మిక మార్గదర్శకుడు సంత్ సేవాలాల్ మహారాజ్ 18వ శతాబ్దంలోనే బంజారాల సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన ఎనలేని కృషి చేసారన్నారు. కర్ణాటకలో జన్మించిన సేవాలాల్ అహింస, శాకాహారం, ధర్మం, క్రమశిక్షణను పాటించాలని బోధించారన్నారు. మత మార్పిడులను, మూఢనమ్మకాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సేవాలాల్ మహారాజ్ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, ఒక గొప్ప దార్శనికుడు. భవిష్యత్తులో వాహనాల వాడకం (ఎడ్లు లేని బండ్లు) నీటి ఎద్దడి గురించి ఆయన ఆనాడే చెప్పారు. అంత ముందు చూపు కలిగిన మహా జ్ఞానీ వారని అన్నారు. సేవాలాల్ మహారాజ్ మనకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు. ఆయన తండాల అభివృద్ధికి, విద్యకు, స్త్రీల గౌరవానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని అయన అన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపిన అహింసా మార్గంలో నడుస్తూ, బంజారా సమాజం విద్యావంతంగా, ఆరోగ్యంగా, ఐకమత్యంతో ముందడుగు వేయాలన్నారు. ఆయన ఆశయాలను సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అందరికీ తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. నేను గిరిజన జాతికి చెందిన బిడ్డను కాకపోయినా మిర్యాలగూడ గిరిజన సోదర సోదరిమణులు అందరూ నన్ను వారి సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకుంటూ నాతో పాటు నడిచి ఈరోజు నన్ను శాసనసభ్యుడిగా నిలబెట్టారని వారి ఋణం నేను ఇప్పటికి మరచిపోను వారికి వారి కుటుంబాలకు, నా ఊపిరి ఉన్నంతవరకు అండగా ఉంటానని ఆయన అన్నారు. ప్రజాప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. మన గిరిజన నాయకుడు శంకర్ నాయక్ కు ఎమ్మెల్సీ తో పాటు, కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్మన్ పదవిని కూడా ఇచ్చి గిరిజనులను గౌరవించిందని ఆయన అన్నారు. ఆరాధ్య దైవం బంజారాలకే మాత్రమే కాదు నాకు కూడా ఆరాధ్య దైవమైన్నారు. సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అందరితో కలిసి జరుపుకుంటునందుకు నేను అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. అనంతరం గిరిజన నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం గిరిజన నాయకులు డి.స్కై ల్యాబ్ నాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొర్ర నాగునాయక్, డి.రవితేజనాయక్, సిద్ధూనాయక్, శారద, గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నానిక్యనాయక్, కృష్ణానాయక్, ఎం.దశరదనాయక్, వెంకట్రామనాయక్, తహసీల్దార్లు పి. శ్రీనివాస్, డి.జవహరలాల్ నాయక్, రాగ్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్, ఎంపీడీఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపిఓ మాతంగి సురేష్, కాంగ్రెస్ నాయకులు చిరుమరి కృష్ణయ్య, పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి,నాయకులు డి.శేఖర్ రెడ్డి, తాళ్లపల్లి సురేష్,, బిఆర్ఎస్ నాయకులు డి.రవినాయక్, ఎ. హాతీరామ్, ఎం.రవీందర్నాయక్, సిపిఎం నాయకుడు ఎర్రనాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

### సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం

అమరావతి, : సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పదవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది.

## రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

### బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్



అమరావ: రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కనీస వేతనలు 26వేలకు పెంచాలి

### చీపురుపల్లిలోలో అంగన్‌వాడీల ఆందోళన

చీపురుపల్లి: తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అంబాల గౌరి నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ మాలతి, నాగమణి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీలను ఇబ్బందులు గురిచేస్తుందని వారు అన్నారు. ఫిబ్రవరి నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు.

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం

శ్రీనగర్, :జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

## నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు: కెటిఆర్

హైదరాబాద్: తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

### పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

### గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

అమరావతి,ఫిబ్రవరి23 : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు, రెండో సంవత్సరం అన్ని సబ్జెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు. విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శు భాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్దులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

## నది దాటుకుంటూ వచ్చిన విద్యార్థులు

### రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని హాజరు



విజయవాడమన్యం జిల్లాలోని నాగవల్లి నది దాటుకుంటూ ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు రాయడానికి విద్యార్థులువెళ్లారు. వేరే మార్గం లేక వారు నది దీటుకుంటూ వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం చాణక్య కాలేజీకి చెందిన యర్రా హేమశ్రీ ఉప్పులూరు గ్రామానికి చెందిన విద్యార్ది ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినా సోమవారం ఇంటర్ మీడీయట్ పరిక్షలకు తన తండ్రి సహకారంతో హజరైనట్లు చాణక్య కాలేజీ ప్రతినిధి చెప్పారు. హేమశ్రీ తన కాలేజీలో బెస్ట్ విద్యార్దిని చెప్పారు. నడవలేని స్తితిలో ఉన్నప్పటి హేమశ్రీ పరిక్షలకు హజరైనట్లు చెప్పారు. మార్చి 24 వరకు జరగనున్న పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసిటివి కెమెరాల నిఘా ఉంటుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జిల్లా స్థాయి పరీక్షా కమిటీలు (డిఇసి), ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం తనిఖీలు చేస్తాయని పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### నేడు అసెంబ్లీలో వివరాలు ప్రవేశ పెడతాం

### వైకాపా దేవదేవుడిని రోడ్డుకు లాగింది

### మీడియాతో చిట్చాట్‌లో మంత్రి లోకేశ్



అమరావతి,ఫిబ్రవరి23: తిరుమలో కొలువుదీరిన దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగా బయటపెడ తామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలన్నీ మంగళవారం అసెంబ్లీలో పెడతామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ లాబీలో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. సభకు రావడం సభ్యులుగా వారి బాధ్యత అంటూ వైసీపీ ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరంటూ ఈ సందర్భంగా వారికి చురకలంటించారు. దేవుడిని సైతం వైసీపీ రోడ్డు మీదకు తీసుకురావడం బాధాకరమన్నారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు చేయడం అభ్యంతరకరమని లోకేశ్ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణ వెల్లువెత్తాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది సిట్. అయితే ఈ వ్యవహారంలో తమ తప్పేమీ లేదంటూ వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతేకాకుండా.. కూటమి ప్రభుత్వం తమపై అసత్య ప్రచారం చేస్తోందంటూ వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డు మీదకు తీసుకురావవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.